క్లుప్తంగా

శ్రీకృష్ణ దేవస్థానంలో గీతా జయంతి వేడుకలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక పున్నమిఘాట్ వద్ద గల శ్రీకృష్ణ దేవాలయంలో శనివారం నిర్వహించిన గీతా జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. దేవస్థానం అధ్యక్షుడు ఎం.రాజయ్య నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలకు హాజరైన వంద మంది విద్యార్థులతో ఆధ్యాత్మిక గురువు డాక్టర్ గానుగుల యుగంధరాచార్య భగవద్గీత శ్లోకపఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పారాయణతో విద్యార్థులలో స్వచ్ఛమైన ఉచ్చారణ, మానసిక వికాసంతో పాటు ఏకాగ్రత పెరిగి జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు. దేవస్థానం కమిటీ సెక్రటరీ వెంకటేశ్వర్లు విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను అందజేస్తూ భగవద్గీత మత గ్రంథం కాదని, దీనిని పఠించడం వలన వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని చెప్పారు. కోశాధికారి నారాయణ తీర్థప్రసాదాలను అందించారు. ప్రస్తుత కాలంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించటంతో మన సనాతన సంస్కృతి, పురాణ ఇతిహాసాలు కలకాలం నిలుస్తాయన్నారు. నిర్వాహకులను తల్లిదండ్రులు, భక్తులు ప్రశంసించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాజమండ్రికి చెందిన జాహ్నవి నృత్య బృందం నృత్య ప్రదర్శన ఇచ్చింది. ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై ప్రదర్శించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రమాదశాత్తు బైక్‌పై నుంచి కిందపడిన వివాహిత ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జి.కొండూరు గుర్రాజు పాలెంనకు చెందిన ధనికొండ శ్రీరామమూర్తి, భానుప్రియలు భార్యభర్తలు. శ్రీరామమూర్తి పొలం పనులు చేస్తుండగా, భానుప్రియ ఎల్‌బీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పని చేస్తోంది. ఈ నెల 20న భార్యభర్తలిద్దరు బైక్‌పై విజయవాడ వస్తుండగా, కొత్తూరు తాడేపల్లి దాటిన తర్వాత భానుప్రియ నీరసంగా ఉందని చెప్పి బైక్‌పై నుంచి కింద పడిపోయింది. వెంటనే ఆటోలో కొత్త ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. ఘటనపై మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరికీ వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా చెప్పారు. నేషనల్ కన్స్యూమర్స్ డే సందర్భంగా శనివారం రావిచెట్టు సెంటర్ సమీపంలోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో వినియోగదారులు హక్కులపై అవగాహన సదస్సు జరిగింది. విద్యాకన్నా మాట్లాడుతూ.. 1986వ సంవత్సరం నుంచి మన దేశంలో వినియోగదారుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా అన్యాయమైన వ్యాపారం, మోసం, సేవల్లో లోపం వంటి వాటి నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించడం ఈ చట్టం ముఖ్య లక్ష్యమని విద్యాకన్నా చెప్పారు. వినియోగదారులు కోర్టులను ఆశ్రయించి పరిహారం పొందవచ్చన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



రజిత గరుడ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీవారు



కొత్తగుళ్లు ప్రాంగణంలో పాండురంగడు



చిట్టినగర్‌లో విశేష అలంకారంలో స్వామి వారు



పూలంగిసేవలో పాండురంగడు



నగరోత్సవంలో నగరాల సీతారామ స్వామి దేవస్థానం స్వామి వారు

వైష్ణవాలయాల్లో భక్తుల కోలాహలం

- భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు
- ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన స్వామి వార్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని వైష్ణవాలయాల్లో శనివారం భక్తుల కోలాహలం నెలకొంది. శ్రీమన్నారాయణుడి దర్శనం కోసం భక్తులు గంటల కొద్ది క్యూ లైన్లలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. అన్ని వైష్ణవాలయాల్లో స్వామి వార్లను ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకునేందుకు వీలుగా ఆయా ఆలయాల యజమాన్యాలు ఏర్పాట్లు చేశాయి. తెల్లవారుజాము నుంచి ఉత్తర ద్వారాల గుండా స్వామిని దర్శించుకొని భక్తులు తరించారు. ఆలయాలు భక్తుల హరి నామస్మరణలతో, అర్చకస్వాముల మంత్రోచ్ఛరణలతో మార్మోగాయి. ప్రధానంగా ఆయా ఆలయాల్లో మూలవిరాట్‌లకు ఉదయం ఉంచి పలు ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం కూడా కలిసి రావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రముఖ ఆగమ పండితులు మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి పర్వదినం రోజున స్వామివారిని అర్చిస్తే అమోఘమైన ఫలితాన్ని అనుగ్రహిస్తాడన్నారు. అందువలనే ఆ దేవదేవుని ఆశీస్సుల కోసం భక్తుల వేల సంఖ్యలో పోటెత్తుతున్నారని వివరించారు.

శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో..

వన్‌టౌన్‌లోని చారిత్రక ఆలయమైన బ్రాహ్మణవీధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉదయం ఐదు గంటలకు ఉత్తర ద్వారం వద్ద అత్యంత రమణీయంగా అలంకరించిన వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఆయా క్యూలైన్లలో బారులు తీరి కనిపించారు. ఉదయం సహస్రనామార్చన, వైకుంఠ గద్య పారాయణ, తిరుప్పావై ఉత్తరద్వార అర్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తిరుప్పావై పాశుర హారతి, అనంతరం గరుడాహనరూఢుడై వైకుంఠ ద్వారం ద్వారా స్వామి వారు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం స్వామి వారు గరుడ వాహనంపై నగరవీధుల్లో ఊరేగారు. వన్‌టౌన్ సీఐ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయం వద్ద ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఆలయ చైర్మన్ గుడిపాటి పాపారావు, ఈవో ఘంటసాల శ్రీనివాసు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



చందనాలంకారంలో కోదండరాముని మూలమూర్తులు

పలు ఆలయాల్లో..

కొత్తగుళ్ల ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీకోదండరామాలయంలో స్వామి వారు సీతాలక్ష్మణ సమేతంగా ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న పాండురంగస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాండురంగడికి పూలంగిసేవను నిర్వహించారు. మురళీకృష్ణమాచార్యులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామస్వామి వారి ఆలయంలో సీతా లక్ష్మణ సమేత శ్రీ రామచంద్రుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సహస్రనామార్చనలు, తులసీదళార్చనలతో పాటుగా పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు. భావనారాయణవీధిలోని శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం ఊరేగింపు సేవను నిర్వహించారు. కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో భక్తులు బారులు తీరారు. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి ప్రత్యేక అలంకారం చేశారు.



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న అర్చకుడు

దక్షిణావృత శంఖంతో తీర్థం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు స్వామి వారికి సుప్రభాత సేవ, సప్త ద్వారాల పూజ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయ అర్చకులు రామరత్నమాచార్యులు, ఇతర అర్చకులు స్వామి వారికి విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. సాయంత్రం స్వామి వారి నగరోత్సవ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, ఇతర కమిటీ సభ్యులు క్యూలైన్లను పర్యవేక్షించారు. భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారు ఉత్తర ముఖంగా భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక వ్రతాల్లో భక్తులు పాల్గొన్నారు.



వన్‌టౌన్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు



కొత్తగుళ్లు కోదండ రామాలయంలో విశేష అలంకరణలో స్వామి వారు

వైభవంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



చిన్నారులతో నిర్వాహకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. బుద్ధి మాంద్యం కలిగిన చిన్నారులతో కేక్ కట్ చేయించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా డెవలప్‌మెంట్ సెంటర్ ప్రిన్సిపాల్ జే సునీత మాట్లాడుతూ.. మానసికంగా, బలహీనంగా ఉన్న వారి కోసం ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. సెంటర్ స్థాపించిన ఆనతి కాలంలోనే మంచి ఫలితాలు సాధించామన్నారు. ఇందులో భాగంగా వారికి అవసరమైన ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్ వంటి సేవలను అందిస్తున్నామని చెప్పారు. ఇటువంటి సేవలను వినియోగించుకునేందుకు 99859 51397 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. ప్రతి పండుగ సందర్భంగా సెంటర్‌లో వేడుకలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో మానసిక స్థితి మెరుగుపరచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.



రథం సెంటర్‌లో పండ్లు అందజేస్తున్న దాతలు

దుప్పట్లు, పండ్లు పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని కుమ్మరిపాలెం సెంటర్‌లోగల షాలేము మినిస్ట్రీ చర్చి ఆధ్వర్యంలో అనాథలు, అన్నార్తులకు పండ్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. శనివారం సాయంత్రం కనకదుర్గ ఫ్లైఓవర్ కింద ఫుట్‌పాత్‌పై ఉంటున్న అనాథలు, అన్నార్తులకు ఆహార పదార్థాలతో పాటు దుప్పట్లు, వస్త్రాలు అందించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ కాపరి పుట్ల సత్యవేదం మాట్లాడుతూ స్ట్రీట్ క్రిస్మస్ క్యారల్స్ పేరుతో సహాయ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో విద్యా రాణి, వినీల భవ్య, సుధా సారిక, లాస్య, స్వీటీ, పెద్దలు రవికుమార్, మణిబాబు, విజయ్‌కుమార్, గంధం ఎస్తేరు, స్వరూప, రాధా, బేబీ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు తదితరులు

విజయ డెయిరీలో...

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కృష్ణా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) ఆవరణలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫ్యాక్టరీ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో చైర్మన్ చలసాని ఆంజనేయులు, పాస్టర్ శేఖర్‌లు కేక్ కట్ చేసి ఉద్యోగులు, సిబ్బందికి అందజేశారు. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు, పాల పదార్థాలను అందజేస్తున్న విజయ డెయిరీ తరుపున పాడి రైతులకు, వినియోగదారులకు , సమితి సిబ్బందికి అందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలను చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు చలసాని చక్రపాణి, సమితి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా పాలన

భవానీపురం(విజయవాడపశ్చిమ): మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన అందిస్తోందని వక్ఫ్‌బోర్డ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని చెరువు సెంటర్‌లో పర్యటిస్తున్న క్రమంలో స్థానిక లేబర్‌కాలనీలోని మదీనా మసీదును ఆయన సందర్శించారు. మసీదు పెద్దలను కలిసిన సందర్భంలో వారు మదరసా, మసీదు సమస్యలపై వినతి పత్రం అందజేసి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి గతంలో మున్నెన్నడూ లేని విధంగా సీఎం జగన్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. ముస్లిం మైనార్టీలను ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు దోహద పడుతుందని చెప్పారు. పెత్తందారు చంద్రబాబు పాలనకు, పేదల పక్షపాతి జగనన్న పాలనకు మధ్య వ్యత్యాసాన్ని గమనించాలని కోరారు. విజనరీ లీడర్ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ బలపరిచి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, మసీదు పెద్దలు షఫీఉల్లా, ఉస్మాన్ బేగ్, రిజ్వాన్ బాయ్ పాల్గొన్నారు.



గౌస్ మొహిద్దీన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ముస్లింలు

వృద్ధులకు కళ్లజోళ్ల పంపిణీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పరీక్షలు చేయించుకుని, కళ్లజోళ్లు అవసరమని గుర్తించిన వారికి శనివారం కళ్లజోళ్లను అందజేశారు. నగరంలోని అజిత్‌సింగ్‌నగర్ యూపీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని పలువురికి కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా 243 సచివాలయానికి సంబంధించి 14 మందికి, 244 సచివాలయం పరిధిలో 38 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. కళ్లజోళ్లు అందుకున్న వారు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ డీపీఎంఓ డాక్టర్ నవీన్, డెప్యూటీ తహసీల్దార్ ఎన్.కోటేశ్వరమ్మ, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సృజన్ తదితరులు పాల్గొన్నారు.



కళ్లజోళ్లు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని తదితరులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



సిద్ధార్థ వైద్య కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు



ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో పూర్వ విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో 1996–2001 బీడీఎస్ బ్యాచ్ విద్యార్థులు శనివారం ఆ కళాశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజ్ఞ – 23 పేరుతో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. అందులో భాగంగా నాటి గురువులతో పాటు ప్రస్తుతం ఉన్న గురువులను కృతజ్ఞతగా సత్కరించారు. తమ అభ్యున్నతికి కారణమైన కళాశాలకు రూ.3 లక్షల విలువ చేసే ఇంట్రాక్టీవ్ డిజిటల్ ప్యానల్(స్మార్ట్ బోర్డ్)ను , ఆడియో సిస్టమ్‌ను బహూకరించారు. కళాశాలలో ఆధునిక పద్ధతిలో విద్యాబోధన, సెమినార్లు, సదస్సుల నిర్వహణకు స్మార్ట్ బోర్డును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసారి శ్రీనివాసరావుకు అందజేశారు. తాము చదువుకునే రోజుల్లో ప్రజ్ఞ అని ఒక సైంటిఫిక్ క్లబ్‌ను నిర్వహించినట్లు గుర్తు చేసుకున్నారు. తమ మధ్య స్నేహాన్ని బలోపేతం చేసిన ఆ క్లబ్ పేరు మీదగా ఈ వేడుకలకు ప్రజ్ఞ – 23 పేరు పెట్టామన్నారు. కాగా పాత మిత్రులను, పూర్వ గురువులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.రూపశ్రీ, డాక్టర్ యు.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో 1998 బ్యాచ్ విద్యార్థులు శనివారం ఆ కళాశాలలో కలుసుకున్నారు. తాము వైద్య విద్యను అభ్యసించి 25 ఏళ్లు గడిచిన సందర్భంగా వారంతా సమావేశమై రజతోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్‌లను మర్యాదపూర్వకంగా కలిసి, ఆ కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ కిషోర్, డాక్టర్ విజయ్‌సింహ, డాక్టర్ కిరణ్ మాదల, డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ ఉమాకళ్యాణి, డాక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో పలువురు మంత్రులు



మంత్రి వేణుగోపాల కృష్ణకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈఓ రమేష్‌బాబు



మంత్రి ముత్యాలనాయుడికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను శనివారం పలువురు మంత్రులు దర్శించుకున్నారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బి.ముత్యాలనాయుడు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న మంత్రులు ముత్యాలనాయుడు, వేణుగోపాల కృష్ణకు ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈఓ ఎస్.రమేష్‌బాబు, బలరామ్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

బబ్బూరి గ్రౌండ్స్‌లో ఎగ్జిబిషన్ ప్రారంభం



భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం కరకట్ట సౌత్ రోడ్డులోని పున్నమి ఘాట్ వద్ద గల బబ్బూరి గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన మణికంఠ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన పలు సెట్టింగ్‌లను పరిశీలించారు. బెంగళూరు ప్యాలెస్, చంద్రయాన్–3 నమూనాను తీర్చిదిద్దటం అభినందనీయమన్నారు. మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్, సంక్రాంతి సెట్టింగ్, జెయింట్ వీల్, కొలంబస్, టోరా టోరా, బ్రేక్ డాన్స్, చిన్న పిల్లల ఆట వస్తువులు ప్రత్యేకమని నిర్వాహకులు కృష్ణ, అయ్యప్ప చెప్పారు. కలకత్తా, జైపూర్, ఢిల్లీ, మహారాష్ట్ర చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. కార్యక్రమంలో విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి పాల్గొన్నారు.